క్లుప్తంగా

పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా నల్లకిషోర్



వేల్పూర్: మండల కేంద్రంలో వేల్పూర్ పట్టణ పద్మశా లి సంఘం అధ్యక్షుడుగా నల్లకిషోర్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చాట్ల మహాదేవ్, కోశాధికారిగా కన్నెపల్లి అరవింద్, ప్రధాన కార్యదర్శిగా తమ్మె గణేష్, సంయుక్త కార్యదర్శిగా మైసల బాలకిషన్, కార్యవర్గ సభ్యులుగా బాల గంగాధర్, పిల్లమారి ప్రహ్లాద్, రుద్ర సురేందర్, మైసల రాజగంగారాం, పిల్లమారి విజయ్, నల్ల సురేందర్ లను ఎన్నుకున్నారు.

ముగిసిన వేద ధర్మ ప్రచార వారోత్సవం

బోధన్: శ్రావణ మాసం పురస్కరించుకుని పట్టణ కేంద్రంలోని వీక్లి మార్కెట్ సమీపంలో గల ఆర్య సమాజ్ దయానంద్ గోశాల ఆధ్వర్యంలో శ్రావణి వేద ధర్మ ప్రచార యజ్ఞ వారోత్సవాలను ఈ నెల 13న ప్రారంభించారు. ఆదివారం ముగింపు సందర్భంగా యజ్ఞబ్రహ్మశ్రీ ఓం ప్రకాష్ యజ్ఞాచార్య, వేద ప్రచారకురాలు కవిత విశేష బలి, వైశ్య దేవ యజ్ఞం,పూర్ణాహుతి,దంపతులకు ఆశీర్వాదం ప్రక్రియలను నిర్వహించి ప్రవచనాలు చేశారు. ఋగ్వేదం, యజుర్వేదం,సామవేదం, అధర్వణ వేదాలు, యజ్ఞం ప్రాముఖ్యతను వివరించారు.ఆర్య సమాజ్ ప్రతినిధి ప్రదీప్‌గుప్తా, సభ్యులు ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు వేశారు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని ఆర్టీసీ డిపో వెనక కాలనీలో ఆదివారం యుద్ధ ప్రాతిపదికన రోడ్డు వేశారు. పట్టణంలో షర్బతీ కెనాల్ రోడ్డు మరమ్మతు చేస్తున్న సందర్భంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా వాహనాల దారి మళ్లింపు చేయడానికి ఎమ్మెల్యే ఆదేశాను సారం రోడ్డు వేశామని కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. శర్బతీ కెనాల్ మరమ్మతు పనులు పూర్తి అయ్యే వరకు వాహనదారులు ఈ రోడ్డు ద్వారా వెళ్లాలని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

మొక్కలు నాటాలి

ఆర్మూర్‌టౌన్: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటాలని మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకే శ్రీనివాస్ తెలిపారు. ఆర్మూర్‌లోని 3వ వార్డులోని శ్రీ మురళి కృష్ణ ఆలయంలో నవనాథ బ్రాహ్మణ సేవ సంఘం ఆవరణలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు, మూర్తి, రాజేశ్వర్‌రావు, మోహన్, పుష్పాకర్‌రావు, గణేష్, రాకేష్, నరేందర్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకాలన్ గ్రామంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. సహకర సంఘాల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, డైరెక్టర్లు, సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనం ఘాట్‌ను అభివృద్ధి చేయాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని గూండ్ల చెరువులో గణేశ్ నిమజ్జనానికి ప్రత్యేక ఘాట్‌ను త్వరగా అభివృద్ధి చేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం గూండ్లచెరువులో మండపాల నిర్వాహకులు ప్రతిష్ఠించిన విగ్రహాలను నిమజ్జనం చేస్తారని పేర్కొన్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

ముళ్లపొదల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- వేల్పూర్‌లో పొంచి ఉన్న ప్రాణాపాయం
- పట్టించుకోని అధికారులు



వేల్పూర్‌లో పోచమ్మగుడికి వెళ్లేదారిలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్లపొదలు



ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన ముళ్లచెట్లు



నీళ్లలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ ఆఫ్ చేసే హాండిల్

వేల్పూర్: మండల కేంద్రంలో పోచమ్మగుడికి వెళ్లే దారిలో ఉన్న గ్రామ, వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. దీంతో అక్కడికి అడుగు పెట్టరాకుండా మారింది. గ్రామానికి కరెంటు సరఫరా చేసే పెద్ద ట్రాన్స్‌ఫార్మను ఆన్ ఆఫ్ చేసే హాండిల్ చుట్టూ నీరు చేరింది. ఏదైనా అవసరం నిమిత్తం కరెంటును ఆన్ ఆఫ్ చేయాలంటే నీటిలో నుంచి వెళ్లి పనిచేయాల్సి ఉంటుంది. అనుకోకుండా హాండిల్‌కు విద్యుత్తు సరఫర జరిగితే నీటికి కూడా కరెంటు సరఫరా జరిగి అక్కడికి వెళ్లిన వ్యక్తి చనిపోయే ప్రమాదం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చి మొక్కలు శుభ్రంచేసే వారు కరువయ్యారు. ఈ విషయమై మండల ట్రాన్స్‌కో ఏఈ జశ్వంత్‌రావును సంప్రదించగా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించి ఆటంకం లేకుండా చేస్తామని పేర్కొన్నారు.

మూడు నెలలుగా తాగునీటి పైపులైనుకు లీకేజీ

పోచమ్మగుడి వద్ద నుంచి బోర్‌వెల్ ద్వారా గ్రామంలోని మూడు వాటర్‌ట్యాంకులకు నీటిని సరఫరా చేసే పైపులైనుకు కూడా ట్రాన్స్‌ఫార్మర్ల వద్దనే లీకేజీ జరిగి సుమారు మూడు నెలలకు పైగా గడుస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పోచమ్మగుడి వద్ద వాగు ఒడ్డుకు ఉన్న బోరువెల్ నీటిని తాగునీటికి కూడా ఉపయోగిస్తామని, లీకేజీ వద్ద చేరే మురికినీరు ట్యాంకులకు సరఫరా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జీపీ కార్యదర్శి వినోద్‌ను సంప్రదించగా రెండ్రోజుల్లో లీకేజీకి మరమ్మతు చేయిస్తామని పేర్కొన్నారు.

చాలా రోజులుగా విన్నవిస్తున్నాం



ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి అక్కడికి వెళ్లరాకుండా ఉన్న విషయం, పైపులైను లీకేజీ విషయమై చాలారోజులుగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. తొందరగా మరమ్మతు చేసి ఇబ్బంది తొలగించాలి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఎల్లవేళలా శుభ్రంగా ఉంచితే ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉంటుంది. – ముత్యాల లక్ష్మణ్, రైతు, వేల్పూర్

హడలెత్తిస్తున్న కుక్కలు

- ఆర్మూర్ పట్టణంలో భయాందోళనలో ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి



జౌటీ గల్లీలో..



ఆర్టీసీ బస్టాండ్‌లో తిరుగుతున్న కుక్కలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణంలోని వీధులలో తిరుగుతున్న కుక్కలు వా హనదారులను వెంబడిస్తున్నాయి. పట్టణంలో 36 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులో ఐదు నుంచి పది వరకు కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ పరిధిలో సుమారు 1400పైన కుక్కలు ఉన్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట వ్యక్తులు కుక్కల దాడిలో గాయపడుతున్నారు. ప్రభుత్వాస్పత్రిలో రోజుకు 8 నుంచి 9 కుక్క కరిచిన కేసులు నమోదు అవుతున్నాయి. వీధుల్లో కుక్కలు తిరగడంతో చిన్నారులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఉదయం పూట పాఠశాలకు బయలుదేరినప్పుడు కుక్కలు వాహనాలను వెంబడించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

బస్టాండ్ పరిసరాల్లోనూ ఇబ్బందులు

పట్టణంలోని ఆర్టీసీబస్టాండ్ పరిసరాల్లో కూడా వీధి కుక్కలు ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రాత్రి సమయంలో బస్టాండ్ లోపల సైతం కుక్కలు రావడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య దృష్టికి వచ్చింది

పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందన్న సమస్య మాదృష్టికి వచ్చింది. త్వరలోనే కుక్క ల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు కుక్కల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. – రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ఆదివాసీ విద్యార్థులకు న్యాయం చేయాలి



పెర్కిట్‌లో మాట్లాడుతున్న నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల జరిగిన మొదటి విడత బీఈడీ కౌన్సిలింగ్‌లో అధికారులు సంబంధం లేని ప్రశ్నలతో ఆదివాసీ నాయకపోడు విద్యార్థులకు అన్యాయం చేశారని ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, ఉద్యోగ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్ ఆరోపించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిదిలోని పెర్కిట్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బీఈడీ కౌన్సిలింగ్‌లో ఆదివాసీ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై త్వరలో హైదరాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలవనున్నట్లు వెల్లడించారు. ఆదివాసీ విద్యార్థులకు న్యాయం చేయకపోతే త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు గంగ సాయన్న, శానం పవన్, కొసెడుగు రవి, కొద్రు నవీన్, అంజయ్య, మన్నె సాగర్, తదితరులున్నారు.

ఘనంగా తీజ్ పండుగ



నికాల్‌పూర్‌లో నృత్యం చేస్తున్న యువతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో బంజారల సంప్రదాయ పండుగ తీజ్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల క్రితం మట్టిపాత్రలో పోసిన గోధుమ గింజలు గడ్డిగా మొలకెత్తడంతో మహిళలు వాటిని తలపై ఎత్తుకుని సంబురాలు చేసుకున్నారు. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారికి పూజలు చేసి గోధుమ గడ్డిని చెరువులో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో మండల బంజార సేవాసమితి అధ్యక్షులు భీమ్‌నాయక్, బానోత్ సుమన్ పాల్గొన్నారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథులు



పెర్కిట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు



కొనుగోలు చేయడానికి వచ్చిన యువకులు

- కొనుగోలు చేసేందుకు వస్తున్న యువజన సంఘాలు
- 27న వినాయక చవితి

ఆర్మూర్ టౌన్: దేశంలో వైభవంగా జరుపుకునే పండుగలలో వినాయక చవితి ఒకటి. ఈ పండుగకు చిన్నారులు, యువత, యువజన సంఘాలు, కాలనీ అభివృద్ధి కమిటీలు తమ కాలనీల్లో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించటం ఆనవాయితీగా మారింది. ఈ నెల 27 వినాయక చవితి పండుగ ప్రారంభం కానుంది.

జోరుగా విగ్రహాల తయారీ

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో 12మంది కళాకారులు వినాయక విగ్రహాల తయారీలో బిజీగా ఉన్నారు. రాజస్తాన్ నుంచి వచ్చిన కళాకారులు రూ.500 నుంచి రూ. 50,000 వరకు ధరలు గల విభిన్న పరిమాణాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు. మట్టి గణపతి విగ్రహాలు ధరలు రూ.1,000 నుంచి రూ. 15వేల వరకు ఉన్నాయి.చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ ఆకట్టుకునే విధంగా విగ్రహాల రూపకల్పన చేశారు. మరికొందరు నాందేడ్, మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు.

పర్యావరణానికి ప్రాధాన్యత..

పర్యావరణ పరిరక్షణ కోణంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మట్టి గణపతిని ప్రోత్సహిస్తున్నాయి. ఈ ప్రభావంతో చాలామంది పీవోపీ విగ్రహాల కంటే మట్టివిగ్రహాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.

పెరిగిన ధరలు

ఈ సంవత్సరం ముడి సరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా స్వల్పంగా పెరిగినట్టు కళాకారులు తెలిపారు. చాలా మంది భక్తులు ఇప్పటికే అడ్వాన్స్ చెల్లించి తమ విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు.

15 ఏళ్ల నుంచి తయారు చేస్తున్నాం



రాజస్థాన్ నుంచి వచ్చిన మేము గత 15 సంవత్సరాల నుంచి వినాయక విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నాం. రూ. 500 నుంచి రూ.50 వేల వరకు ధరలు గల గణపతి విగ్రహాలు ఉన్నాయి. ముడిసరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా పెరిగాయి. – జస్సారాం, వినాయక విగ్రహాల తయారీదారుడు

ధరలు చాలా పెరిగాయి

వినాయక విగ్రహాల ధరలు గత ఏడాది కన్నా చాలా పెరిగాయి. గతంలో పదివేలకు కొనుగోలు చేసిన గణపతి ఈ ఏడాది రూ. 15వేలకు లభిస్తుంది. దీంతో చిన్న గణపతి కొనుగోలు చేయాలనుకుంటున్నాం. – రమేష్, స్థానికుడు

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



దూపల్లి గ్రామంలో శ్రీ కృష్ణుడి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



ఆర్మూర్‌లో శ్రీకృష్ణుడికి పంచామృతాభిషేకం చేస్తున్న ఇస్కాన్ ప్రభూజీలు



తిమ్మాపూర్‌లోని శ్రీసత్యానంద మహర్షి భక్త మండలి ఆధ్వర్యంలో..



ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న యువకులు

రెంజల్/ఆర్మూర్‌టౌన్/మోర్తాడ్ : రెంజల్ మండలం దూపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ కృష్ణాజన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి బాజాబజంత్రీలు, డప్పు చప్పుళ్లు, డీజే పాటలతో శ్రీ కృష్ణుడి విగ్రహ మూర్తితో పల్లకీ సేవ, శోభాయాత్ర నిర్వహించారు. ఉట్టిని కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. గత 15 సంవత్సరాలుగా యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. యాదవ సంఘం ప్రతినిధులు లింగం యాదవ్, నర్సయ్య, సాయిలు, శంక ర్, అశోక్, సహదేవ్, రవి, అబ్బన్న, దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్‌లోని బాలాజీ ఫంక్షన్ హాల్లో ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణుడికి పంచామృత అభిషేకాలు, సంధ్యాహారతి, హరినామ సంకీర్తన, ఝులాన్ యాత్ర, కలశాభిషేకం, పుష్పాభిషేకం, శ్రీకృష్ణ లీలామృత ప్రవచనం, మహా హారతి, బారసాల కార్యక్రమాలు చేశారు.ఇస్కాన్ ప్రభూజీలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ కేంద్రం సభ్యులు, ప్రభుజీలు, భక్తులు,తదితరులు ఉన్నారు. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లో శ్రీసత్యానంద మహర్షి భక్త మండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్

పెర్కిట్(ఆర్మూర్): గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కుల వృత్తి చేసుకునే గౌడ కులస్తులు ప్రమాదానికి గురైతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు పెర్కిట్ దశ గౌడ్, హర్షవర్ధన్ గౌడ్, రాజ్ కుమార్ గౌడ్, లింగా గౌడ్, మోతె రామా గౌడ్, వెంకటేష్ గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



వినాయక్ నగర్ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని పలు కాలనీల్లోని రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. పట్టణంలోని వినాయక్ నగర్, గౌడ్స్ కాలనీ, ప్రగతి నగర్, సాయినగర్ కాలనీతో పాటు చెక్కి క్యాంప్, ఆజాంగంజ్ కాలనీల్లో మట్టి రోడ్లు గుంతలమయంగా ఉండడంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా నీరు నిలిచి మట్టిరోడ్లు బురదమయంగా మారాయి. దీంతో ప్రజల, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పట్టణంలోని శివారు కాలనీలు ఏర్పాటైన ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకావిష్కరణలు



మోర్తాడ్‌లో గంగాతరంగాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్యాభిమానులు

సమాజాన్ని ప్రతిబింబించే ‘గంగాతరంగాలు’

మోర్తాడ్: మండలకేంద్రంలో మోర్తాడ్ సాహితివేత్త దడివె గంగాజమున రచించిన ‘గంగాతరంగాలు’ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ఆదివారం ప్రముఖ కవి, ఇందూర్ బాల సాహిత్య వేదిక అధ్యక్షులు కాసర్ల నరేష్‌రావు, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత వీపీ చందన్‌రావులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాన్ని ప్రతిబింబించే విధంగా గంగాతరంగాలు పుస్తకం ఉందని కొనియాడారు. సాహిత్య అభిమానులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో శతాధిక పుస్తక రచయిత, భవాని సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్, సాహితీ వేత్తలు గఫార్ శిక్షక్, ప్రవీణ్‌శర్మ, మాజీ ఎంఈవో గుండోజి దేవేందర్, కవులు శ్రీనివాసమూర్తి, నంబుల గిరి, శారద, కృష్ణవేణి, అంగల శ్రీవాణి, తిరుమల శ్రీనివాస్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

జగజనని పెద్దమ్మ తల్లి, పితృతర్పణం పుస్తకాలు..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం కమ్మర్‌పల్లికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం, సాహితివేత్త ఉల్లెంగల గంగాధర్ రచించిన ‘జగజ్జనని పెద్దమ్మ తల్లి, పితృతర్పణం’ పుస్తకాలను ఆవిష్కరించారు. జగజ్జనని పెద్దమ్మ తల్లి పుస్తకాన్ని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయ అర్చకులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సముద్రాల అమరనాథ్‌చారి ఆవిష్కరించగా, పితృ తర్పణం పుస్తకాన్ని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గంగాధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇరిగేషన్ డీఈ గద్దె నర్సయ్య, పెండెం శర్వానంద్, బుచ్చయ్య, బాలి భూమేశ్వర్, చింత హన్మంత్, జలంధ్, నాగభూషణం, రాజేశ్వర్, ఆకుల గణేష్, రమేష్, జనార్ధనచారీ, లక్ష్మీనర్సయ్య, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

అలుగుపారుతున్న చెక్కి చెరువు



బోధన్: మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణ చెరువులు నిండిపోయి జలకళను సంతరించుకున్నాయి. పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ సమీపంలో గల చెక్కి చెరువు వర్షం నీళ్లతో నిండిపోయి అలుగు పారుతుంది. బోధన్ –నిజామాబాద్ బైపాస్ రోడ్డు మార్గంలో, అంబేడ్కర్ కాలనీ, బొర్రగణపతి ఆలయం సమీపంలోఉన్న పాండు చెరువు నిండుకుండల్లా మారింది. ఈ రెండు చెరువుల కింద వందలాది ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఈ వానాకాలం సీజన్‌లో రైతులు అత్యధికంగా వరి పంటను సాగు చేశారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నెం. 1800 425 9899